

# సమాంతరం

అలివేలు కనకరత్నం

**అతడు** కాగితాలు ముందేసుకుని కూర్చున్నాడు.

కలం తీశాడు. కాగితం మీద అక్షరం దొర్లలేదు. ఈ బాధ అతనికి కొత్త కాదు. చాలా కాలంగా అతన్ని క్రుంగ దీస్తున్నదే.

ముందున్న కాగితం మీద అర పేజీ మేటరు ఉంది. అది రాయడానికే అతనికి ఆరు రోజులు పట్టింది.

విసుక్కున్నాడు. మథన పడ్డాడు. పెన్ను మూడిచి పక్కకు పెట్టాడు.

అవును మరి. మనసు తెరిపిగా ఉంటేనే కాని కలం నడవదు. కలం నడిస్తేనే కాని కవిత పుట్టదు. అది పుట్టకపోతే అతనికి ఊపిరాడదు. పేరు నిలవదు. కనకనే ఇప్పు డతను పూర్వపు ప్రఖ్యాత రచయిత కాదు. ఉత్త రాజశేఖరం.

తను చేసుకున్న దానికి తను అనుభవించాలి. తప్పదు. దున్నే రోజుల్లో భూమ్మీద నిలబడక, కోసే రోజుల్లో కొడవలి పట్టు కొస్తే ఏముంటుం దక్కడ? ఆమెను తను అనుమానించి, అవమాన పరచిన మాట నిజమే. కాని, తరవాత నిజం తెలుసు కున్నాడు. ఆ తెలుసుకున్న నిజం ఆలస్యంగానే తెలిసింది. అప్పటికే చేతులు కాలాయి.

ఆమె అతనిలోని ఉదాత్తతను చూసి మన సిచ్చింది. అతడు ఆమె అందాన్ని చూసి ప్రేమిం చాడు. ఆమె అతని భార్య. అయినా, అంద మైనది కనకనే అనుమానించాడు. అతనిలోని ఉదాత్తత దెబ్బ తినగానే ఆమె అతన్ని విడిచి వెళ్ళి పోయింది. నిన్నో, మొన్నో కాదు. ఇరవై ఏళ్ళ క్రితం.

నిజానికి అతను సన్మార్గుడు. మంచి ఆలోచనా పరుడు. ఆమె నర్తకి. నిప్పు లాంటి మనిషి. మరి ఇలా జరిగిందేమిటీ అంటే అది అతని తప్పే అనడానికి వీల్లేదు. కేవలం వాళ్ళ దురదృష్టం అనాలి.

సంగీతం, సాహిత్యం, నాట్యం— ఇవి అందరికీ రమ్మంటే వచ్చేవి కావు. ప్రాప్తం ఉంటేనే కానీ అవి అబ్బవు. మనిషికి ఆ గీత ఉండాలి. అంతే. వాటికి మొదలే కాని, తుది లేదు. వాటి పరిధిలో ప్రపంచమే ఒక అంగుళం. అలాంటి కళలు రెండు ఆ ఇంట కాపరం చేశాయ్ ఒకప్పుడు. అదైనా ఐదేళ్ళు మాత్రమే!

## 2

హైదరాబాద్‌లో రాజశేఖరం రిసెర్చి చేస్తున్న రోజుల్లో యూనివర్శిటీలో తారసపడింది సులోచన. ఒకరి నొకరు పరిచయం చేసుకున్నారు మొదట. తరవాత ఆ పరిచయం పెరిగింది. తరుచు కలుసు కుంటూండే వారు.

ఒక రోజున లైబ్రరీలో—

"మీరు రోజూ నా కంటె ముందే వచ్చి కూర్చుం టారు. చూస్తున్నాగా! ఇదంతా చదువుమీద శ్రద్ధేనా అని" అంది అతనితో.

"మీ కా సందేహం ఇన్నాళ్ళకైనా వచ్చింది. సంతోషం. ఇటీజ్ ఎ గుడ్ ఒమెన్."

"అంటే మీ ఉద్దేశ్యం?"

"మీరు లా స్టూడెంటు. సైకాలజీ స్టూడెంటు

అయి ఉంటే మీ కా సందేహం అసలు వచ్చేది కాదు.''

''ఇంతకీ నా సందేహం తీర్చనే లేదు.''

''మీ సందేహంలోనే ఉంది సమాధానం.''

ఇద్దరూ నవ్వుకున్నారు.

రాజశేఖరం అందగాడు. అయితే సులోచన అతి లోక సుందరి. మతి చెడగొట్టే అందం. పెదవులు రెండూ ఒకచోటే ఒకలాగే ఉన్నా కింది పెదవికి శృంగార ప్రాముఖ్యత ఇచ్చాడు సృష్టికర్త. అవి ఆడదాని సొత్తు కనకనే అందం విషయంలో శేఖరానికి పై స్థాయిలో ఉంటుంది సులోచన.

ఆమె లా ఫైనల్ ఇయర్ చదువుతూంది. అతడు పిహెచ్. డి. చేస్తున్నాడు. వాళ్ళు బాగా ఉన్నవాళ్ళు. అతడూ వాళ్ళకి తీసిపోడు. అతని మాటలో మధుర స్వరం ఉంది. నడతలో నిజాయితీ ఉంది. మొత్తం మనిషి లోనే ఉదాత్తత నిండి ఉంది. అది చూసే సులోచన గర్వ పడుతుంది.

అందం, ఆకర్షణ, విద్యాగంధం, శీలం, శిల్పం, కళ—ఇవి చాలా విలువైన వస్తువులు. కనకనే దూరపు బంధువులు. ఎప్పుడో కాని కలవవు. కలవడమంటూ జరిగితే కలిసిన చోట కళ్యాణ తోరణం కట్టి ఉంటుంది. వైభవం వెలుగుతూ ఉంటుంది. అందు చేతనే ఏమో సులోచన పాదం ఉన్న ప్రతి చోటా వేదం చదువు తూన్నట్టు, సన్నాయి నాదం వినిపిస్తున్నట్టు ఉంటుంది అనుకునే వాడు రాజశేఖరం.

అప్పటికే సులోచన నాట్యం నేర్చుకోవడం పూర్తి ...ంది. అక్కడక్కడ రెండు మూడు సార్లు ప్రదర్శనలు ఇచ్చింది కొత్తలో.

ఒక రోజున ఆమె శేఖరంతో అన్నది—

''ఈ సాయంత్రం నా డాన్స్ ప్రోగ్రాం ఉంది.''

''అలాగా. హాపీ న్యూస్. ఎక్కడా?''

''రవీంద్ర భారతిలో.''

''మూడయ్యే సరికే మీ ఇంట్లో ఉంటాను.''

''అలాగే. కలిసి వెడదాం.''

''అన్నట్టు మీరు ఏ సంప్రదాయం ప్రిఫర్ చేస్తారు?''

''ఫస్ట్ కూచిపూడి, నెక్స్ట్ భరతనాట్యం.''

ప్రదర్శన పూర్తి అయ్యాక సులోచనలో ఎంత ప్రతిభ ఉన్నదో తెలుసుకున్నాడు శేఖరం. ఆమె ప్రేక్షకుల కళాతృష్ణకీ, సౌందర్య దృష్టికీ తగినట్లు నర్తించి ఆహ్లాదం కలిగించ గలదు. అంతేకాదు. అలౌకిక ఆనందానుభూతిలోకి లాక్కుపోగలదుకూడా అని గ్రహించాడు.

దరిమిలా శేఖరం, సులోచన దంపతు లయ్యారు.

విశ్వ విఖ్యాతి పొందడానికి షేక్స్పియర్ ఏం పుణ్యం చేశాడో, ముంతాజుని పొందడానికి షాజహాన్ చక్రవర్తి ఏం సుకృతం చేసుకున్నాడో తెలియదు కాని మొత్తానికి సులోచనను పొందడానికి తనూ అలాంటిదే ఏదో చేసుకుని ఉండాలి అని ఎన్నో సార్లు అనుకున్నాడు అతను.

## 3

అత్తవారింటికి రాగానే సులోచనకి ఒక విషయం తెలిసింది. శేఖరంలో అతని విద్యకు మించిన శృంగార కళలు ఉన్నాయని. మొదట కలవర పడినా తరవాత సంతోషించింది, ఎగ్జంప్లరీ కారెక్టర్ అతనిలో ఉందని తెలుసుకున్నాక.

ఒక రోజున గదిలో

''శృంగారం అంటే అసలు నీ కేం తెలుసు. ఆలు మగల ఐదు నిమిషాల కలయికే శృంగారం అనుకుంటున్నావేమో. పొరపాటు. దానికి చాలా కథ ఉంది. చెబుతాను. తొందర పడకు'' అన్నాడు.

అతగాడికి తీసిపోనట్టుగా అతనిలాగే తనూ ఒక మాట విసరాలని ''నా అందాలతో మీ రసికత్వాన్ని కొనుక్కున్నాను'' అంది సులోచన.

''అబ్బో ఇంకేం. నా దారికి నువ్వు దాదాపు వచ్చేసినట్టే. ఒక్క మాట. శబ్దం తను ఎందులోంచి ప్రయాణం చేస్తున్నదో దాన్నిబట్టి నాదం వినిపిస్తుంది. ఫ్లూట్‌లోంచి వచ్చే నాదానికీ, జలతరంగిణి లోని నాదానికీ అందుకే తేడా ఉంటుంది. వీణ తీగల చలనంలోంచి వచ్చే నాదం మళ్ళీ మరోలా ఉంటుంది. అలాగే పురుషునిలోని ప్రణయ చేష్టలకి రెస్పాన్స్ ఇచ్చే స్త్రీని బట్టి శృంగార స్థాయి ఉంటుంది'' అన్నాడు.

ఆమె వింటూంది.


# మీకు 1 లక్ష రూ॥ లను 20 సం॥లలో ఇచ్చే యూకోప్లాన్‌ను వద్దనగలరా?

మీ ఆశ నెరవేర్చటానికి ఒక బ్యాంకు సిద్ధంగా ఉంది. యూకోబ్యాంకు, యూకోప్లాన్ ద్వారా!

**యూకోప్లాన్**

సింగిల్ సేవింగ్స్ మల్టిపుల్ ఇంటరస్ట్

| డిపాజిట్ (రూ॥) | కాల పరిమితి | మొత్తం గడింపు (రూ॥) |
|---|---|---|
| 125.00 ప్రతినెల | మొదటి 120 నెలలకు | 27,215.00 |
| 27,000.00 | గ్రో యువర్ మనీ ప్రణాళిక రెండవ 120 నెలలలో | 79,920.00 |
| 125.00 ప్రతినెల | రెండవ 120 నెలలు | 27,215.00 |
| మొత్తం | | 1,07,135.00 |

రిజర్వ్ బ్యాంక్ ఆదేశానుసారం వడ్డీరేటు ఇవ్వబడును.

యూకోప్లాన్ కేవలం ఒక పొదుపు పథకం మాత్రమే కాదు. ఏకైక బహుముఖ వడ్డీ సంపాదనా సూత్రం. మీకు చేతనైనంత ఆదా చెయ్యండి. యూకోబ్యాంకు దాన్ని సత్ఫలితాల నిచ్చే మార్గాలకు మళ్ళిస్తుంది.

కేవలం నెలకు రూ. 125 ఆదా చెయ్యటం వల్ల 20 సం॥లలో దాన్ని ఒక లక్ష ఎలా చెయ్యవచ్చో చదవండి. యూకోబ్యాంకు యూకోప్లాన్ ద్వారా.

**యునైటెడ్ కమర్షియల్ బ్యాంక్**

మీకు దగ్గరలోవున్న మంచి సదుపాయాలున్న బ్యాంక్

UCO/CAS-127/83 TEL

తిరిగి అతనే అన్నాడు:

"అందుకు ఆడదానిలో బలం ఉండాలి. ఓర్చుకోవడం నేర్చుకోవాలి."

"ఇన్ ఎడ్వాన్స్ నన్ను ఎడ్యుకేట్ చేస్తున్నారా?" అంది సులోచన.

"అబ్బెబ్బె. ఇవన్నీ నీలో ఉన్నాయ్. కనకనే నిన్ను తెచ్చుకున్నాను" అన్నాడు.

రెడీమేడ్ సరుకులా ఉంటాయ్ మాటలు అతని దగ్గర. ఎక్కడా తడుముకోడు. నీళ్ళు నమలడు. మాట్లాడుతూన్న కొద్దీ మాటలు పూరుతూంటాయ్.

ఆ మాటే అతనితో సులోచన ఒకసారి అంటే

"ఔను నీలో కోరికల్లాగ" అన్నాడు.

ఎంతో ఉల్లాసంగా గడిచి పోతున్నాయ్ రోజులు.

అత్తగారు ఏదోపుస్తకం చదువుకుంటూ హాలులో కూర్చుంటే-

'ఒక్కసారి అలా వంటింట్లోకి వచ్చి పో" అన్నట్టు సంజ్ఞ చేస్తాడు తనను. బాగుండదని వెడితే ఏం చేస్తాడో అని భయం.

"ఎప్పుడూ సంజ్ఞలతోనే చెబుతారు, పిలుస్తారు ఏం? సులోచనా అని పిలవ లేరా?" అంది ఒక రోజున.

"పడుచు పెళ్ళాన్ని పిలవడానికినోరువాడకూడదు. ఆ పని కళ్ళు, చేతులూకూడా చెయ్యగలవు. వాటికి మించింది మరొకటి ఉంది. తల" అన్నాడు.

రోజూ సాయంత్రం ఇంటికి రాగానే పువ్వుల పాకెట్ ఆమె మీదికి విసురుతాడు- ఏదో గురి పెట్టి. అతని కవిత్వం ఎంత పదునో, గురి అంత దొడ్డదీ. అనుకున్న చోట ఆ పాకెట్టు పడుతుంది. ఎప్పుడేనా గురి తప్పితే తనను తాను తిట్టుకోక పువ్వుల్ని తిట్టలేక, ఆమెను తిట్టేవాడు.

ఒకసారి ఈ చోద్యం కంటబడిన ముసలావిడ 'మరీ అంత ఇది పనికి రాదు' అన్నట్టు కొరకొర చూసింది కొడుకు వైపు కాదు, కోడలి వైపు.

"భర్తకి వండి వడ్డించడమే కాదు. వంగి అందించాలి కూడా బుగ్గల్ని. అది ఆడదాని ధర్మం" అన్నాడో సారి. దానిమీద కొంత రాద్ధాంతంకూడా జరిగింది ఇద్దరి మధ్యా కొంత సేపు.

ఒక ఆదివారం రోజున అతను తీరుబడిగా ఏదో ఒక వేదాంత ధోరణిలో మాట్లాడుతూంటే ఆపి.

"మీరు విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారకుడుగా మారితే చాలా బాగుండేటట్టుంది" అంది సులోచన కాస్త వేళాకోళంగా. అందుకు.

"వో. అలాగే. అన్ సక్సెస్ ఫుల్ సెక్స్ మిస్ట్రెస్‌గా నువ్వు మారితే?" అన్నాడు.

పెళ్ళైన కొత్తలో ఈ చేష్టలన్నీ చూసి, ఇంకా కొత్త కదా అని సరిపెట్టుకుంది సులోచన. కాని నెలలు గడిచి పోతున్నా అవి తగ్గ లేదు. సరికదా ఇంకా ఎక్కువ అవుతున్నాయ్. ఆయనలో అవి తగ్గుతా యనుకోవడం దేశంలో ధరలు తగ్గుతా యనుకోవడ మంత బుద్ధి పొరపాటు అనుకుంది.

మరీ చిన్న పిల్లాడిలా ప్రవర్తిస్తాడు ఒక్కోసారి. కావడానికి అతగాడు ఇప్పుడు కాలేజీ లెక్చరర్.

చెదురు మదురుగా రెండు మూడు ప్రణయ కలహాలు తప్ప పొరపొచ్చాలు లేవు వాళ్ళ మధ్య.

ఒకసారి సులోచన పుట్టింటికి వెళ్ళి నెల్లాళ్ళుండి వచ్చింది. ఆవేళ్టే, ఇంట్లో శేఖరం లేడు. కాంపు వెళ్ళాడని దాసువల్ల తెలిసింది. మర్నాడు మధ్యాహ్నానికి వచ్చాడు అతను.

"కాలేజీ లెక్చరర్లకి కాంపు లేమిటి?" అంది రోషంతో.

"నెలలు నిండిన దానిలా నెల్లాళ్ళు నీ కాంపు ఏమిటీ?" అన్నాడు ఉక్రోషంగా.

ఆమె రోషం దిగిపోయింది. ఆమె చేతులు అతని క్రాపుని సరిచేశాయ్.

"ఈ కొత్త గాజు లేమిటి?" అన్నాడు.

"నేను నిన్న వచ్చింది ఎక్కడనేం చనుకున్నారు?" నవ్వాడు శేఖరం.

"తెలియక కాదు. మరో సారి మీ పుట్టింటి వాళ్ళని పొగడతావని—. అంతే" అన్నాడు.

ఒక్క నిమిషం ఆగి మళ్ళీ అన్నాడు.

"నన్ను చాలా బాధ పెట్టావు, నెల్లాళ్ళు. నిన్ను అంతకంటె ఎక్కువ బాధ పెట్ట దలుచుకున్నాను ఈ వేళ."

"అదేమిటి? మళ్ళీ అర్జంటుగా ఏ వూరేనా వెడుతున్నారా?"

"అబ్బే — వూళ్ళో ఉండే ..."

"అంటే? ..."

70%

మీ డిపాజిట్ పై
70 శాతం రాబడి

మా లార్స్‌విన్ క్యుములేటివ్ డిపాజిట్ పథకం మీకు మీ
పెట్టుబడిపై సంవత్సరానికి 23 శాతం నెలసరి సామాన్యవడ్డీకి
సరిపోయే, 70 శాతం మించిన మొత్తం రాబడిని ఇస్తుంది.

మా వివిధ పథకాల వివరాల కోసం ఈ కూపను
నింపి, క్రింది చిరునామాకు నేడే పంపండి.

Larsvin Finance
315, 'Chandralok', Sarojini Devi Road, Secunderabad-500 003.

Name: ____________________

Address: ____________________

____________________

Larsvin

ఫోను
విజయవాడ — 61473
ఒంగోలు — 2737

ఫోను:
విశాఖపట్నం — 66366
నెల్లూరు — 4284

ఫోను:
గుంటూరు — 23439
తెనాలి — 3774

Ansari & Mohité 83 3

''మనసులో దాచుకోలేని విషయం ఒకటి చెప్పాలని ఉంది ...''

''చెప్పండి.''

''తలంటుకున్న తల ఆరాక, నువ్వు సోఫాలో కూర్చుని చిక్కు తీసుకుంటూంటే సోఫా క్రింద వరకు వ్రేలాడుతుంది నీ జుట్టు. కుడివైపుకి మొహం మీద పడిన కురుల మధ్యలోంచి మెరిసింది నీ ముక్కుపుడక.''

ఇలాంటివి మనసులో మెచ్చుకుంటారేమో గాని, ఇలా పైకి చెప్పే భర్త లుంటారా ఎక్కడైనా అనిపించింది ఆమెకి.

''బుగ్గమీద కళ్యాణం బొట్టుకోసం కలలుకనే అమాయకపు కన్నె పిల్లవు కాదు నువ్విప్పుడు. ఏమిటీ — అర్థం కానట్టు అలా చూస్తావ్?''

ఆ మాటలు అంటూనే వీధిలోకి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి పడక గదిలో —

తాజమహల్‌ని మించిన అందం. తల తిరిగిపోయే అలంకరణ. నాసికలోంచి నడిబొడ్డు వరకు దిగే అత్తరు, అగరొత్తుల పరిమళం.

శేఖరం మంచం మీద పడుకొని ఉన్నాడు.

ఆమె తలుపులు మూసి వచ్చింది.

వచ్చీరాగానే ఎప్పుడూ ఆవిడ మంచం మీద కూర్చోదు. దాని కో ప్రొసీజరు ఉంది. అతనికితెలుసు. ఆమె కాటుకకళ్ళు ముందు అతన్ని చూస్తాయ్. ఆ దొంగ చూపు అతని మూడ్ని చదువుతుంది. రిజల్టుని మనసు రిసీవ్ చేసుకుంటుంది. పాజిటివ్ అయితే ఒళ్ళు వేడెక్కుతుంది. వేడి ఆ లేడిని ముందుకు నెడుతుంది. ఇంక అప్పుడు ఆవిడగారు మంచం మీద కొస్తుంది. ఇంత జరగడానికీ ఎంతో కాలం పట్టదు. వో అర నిమిషం. ఎప్పుడైనా ఆ చదవడం కొంచెం కష్టమైతే మరో అర నిమిషం. అంతే.

అలాగే వచ్చింది. ప్రక్కమీద కూర్చుంది.

అతడు అచేతనంగా కళ్ళు మూసుకుని ఉన్నాడు. ఆ అచేతనావస్థలో తనలో మినుకుమినుకుమంటూన్న భావన ఏమిటో అతనికే తెలియాలి.

అస్పష్టమైన ఏదో ఉద్వేగంలో లేచాడు. ఆమెను లేవనెత్తాడు. గాఢాలింగనం చేసుకున్నాడు. ఆ స్పర్శ, ఆ బిగువు నిత్యనూతనాలు. మనసులో అలలు అలలుగా వ్యాపిస్తున్న అద్భుత అనుభూతి. ఆమె శరీరం ప్రతి అంగుళం చుంబించాడు. అతని చర్యలకు ఆమె ఇస్తున్న రెస్పాన్స్‌కి రెచ్చిపోయాడు.

ఆమె పడుకుంది. ఆమె కన్నుల్లో, నరాల్లో నిరుపమాన చైతన్యం. ప్రశతిమించిన సుఖానుభూతిలో ఆమె లేవబోయింది. లేవలేకపోయింది' అలసి, సొలసి స్వేదంలో ముద్దయిపోయింది. వెన్నులోంచి విపరీతమైన మధురబాధ.

ఇద్దరికీ అపరిమిత నీరసం. జివ్వున లాగేస్తున్న నరాల మూల్గులు.

వయసు, కోరిక, ఉద్వేగం, చర్య, ప్రతిచర్య— ఇవి ఆ శృంగార రసానుభూతికి నిచ్చెనలు.



అనురాగం, ఆదరణ, పరిమళం, లాలింపు, కొన కంటి చూపుల కొరకొరలు, చిరునవ్వుల కొన మెరుపులు —ఇవి దానికి సృష్టికర్తలు.

మేరువు పర్వతం మీద కూర్చున్న శృంగార దేవత కదిలి, ఆనందంలో కరిగి కరిగి రస రూపంలో అమృతమై బంగారు కాలువగా క్రిందికి దిగివచ్చి ఆ జంటను ఆశీర్వదించిన శుభ ఘడియ లవి.

నాలుగో రోజుకి కాని మళ్ళీ మామూలు మనిషి కాలేక పోయింది సులోచన.

'ఇవి చిత్రవధ' అన్నట్టు ఆమె చూస్తే—

''కాదు — శృంగార కథ'' అన్నాడతను చెల్లింపుగా.

## 4

ఐదేళ్ళు గడిచిపోయాయ్.

సులోచన ఇప్పుడు ప్రఖ్యాత నర్తకి. శేఖరం ప్రముఖ కవి. ఇద్దరూ రెండు చేతలా సంపాదిస్తున్నారు.

సులోచనకు డిమాండ్ బాగా పెరిగింది.

''సులోచనా ...'' పిల్చాడు శేఖరం.

''ఆఁ ...''

''ఏమిటీ బట్టలు సర్దుకుంటున్నావ్?''

''కలకత్తా వెళ్ళాలి గదా. ఎల్లుండే అక్కడ ప్రోగ్రాం. మీకు తెలుసుగదా.''

''వో. అవును. మరిచే పోయాను.''

''మీరూ రెడీ అవండి.''



ఎల్. కె. ఎస్. బంగారం
చేతిలో రొక్కమే!

గ్యారంటీ గల
22 కారట్ల బంగారు ఆభరణాల కొరకు

LKS

L.K.S Jewellers
Gold Jewels & Diamonds
138 N S C BOSE ROAD MADRAS-1

సందర్శించండి :
ఎల్. కె. ఎస్. జ్యువలర్స్,
138, ఎన్, ఎస్. సి. బోస్ రోడ్డు,
మద్రాసు-600 001.




"ఈసారికి నేను రాలేను. ప్రతిసారీ నీతో రావడం ఇబ్బందిగానే ఉంది. ఈ వేళ అసలు కుదరదు. నేనూ విజయవాడ వెళ్ళాలి—రేపు సాహిత్య సభలకి."

చివరికి దాసుని తోడిచ్చి పంపాడు.

ప్రోగ్రామ్ పూర్తి కాగానే వచ్చేసింది.

మరుసటి నెల విశాఖ పట్నం వెళ్ళింది. ప్రోగ్రాం అయిపోయిన వెంటనే రాలేదు. మూడో రోజున తిరిగి వచ్చింది. ఆ నెలలోనే మద్రాసు వెళ్ళినప్పుడు నాలుగు రోజులకి గాని రాలేదు. ఇన్ని రోజులు ఆమె అక్కడ ఏమి చేసింది? శేఖరంలో అనుమానబీజాలు పడ్డాయి. మొలకెత్తాయి కూడా. అనుమానం రాకుండానే ఉండాలి గాని, వస్తే మగాడు మనిషిగా ఉండలేడు. కలిసిరాని కాలం ఇంట్లో చొరబడింది. ముందు సూటీ పోటీ మాటలు. తర్వాత పరుష వాక్కులు. ఆటుపైన ఘర్షణలు. షరా మామూలే! ఒక రోజు ఉన్నట్టుండి తుఫాను చెలరేగింది. దాసు ఏదో చెప్పబోతే చెంపమీద కొట్టి, "గెటువుట్. నువ్వేం చెప్ప నక్కర్లేదు" అన్నా డతను. ఆ దెబ్బ వెనక కసి ఎవరి మీద? ఆ కసి తనమీదేనని సులోచనకు తెలుసు. మర్నాడు సులోచన ఇంట్లో కనబడలేదు.

## 5

సులోచన వెళ్ళిపోయిన రెండు మూడు నెలల్లోనే శేఖరానికి చేసిన పొరపాటు తెలిసింది. తెలిసిన చోటల్లా విచారించాడు. ఆమె జాడ తెలియలేదు. ఆమె ఏమైనట్టు?

మనిషి మనిషిలా బ్రతకలేక పోతున్నాడు తను. ఏకాకి బ్రతుకైంది.

పదిహేను సంవత్సరాలు గడిచిపోయాయ్. ఎడబాటు బజారులో కొని తెచ్చిన ఆ ఇంటి కేలండరులో సంవత్సరాలు తప్ప, తేదీలు లేవు. పదిహేనవ కాగితం అప్పుడే చిరిగింది.

కళ, కాంతిపోయిన ఇల్లు. ఇహ ఉండలేకనేమో తల్లికూడా నాలుగేళ్ళ క్రితం కాలం చేసింది.

ఒకనాడు ఆ ఇల్లు కళా నిలయమే. ఇప్పుడు సహారా యెడారి.

ఏళ్ళతరబడి కడగని గదులు. రంగులు పులమని గోడలు పైన హేళనగా వూగుతూన్న బూజులు. చుట్టూ దురదృష్టపు దుర్గంధం. నడకకు మొహం వాచిన కలం. మనస్తర్ని నలుపు చెయ్యవద్దు అని స్ట్రైక్ చేసిన తెల్లకాగితాలు. తహతహ నచ్చి పోయిన శరీరం.

అతడు కుర్చీలో, ఎదురుగా నేల మీద దాసు, ప్రక్కన టామీ. వాళ్ళు మాట్లాడరు. అది మాట్లాడనే లేదు భయంకర నిశ్శబ్దం. ఇప్పుడు ఆ ఇంటికి వాసరు.

ఇంతకంటె శ్మశానం మేలు అని ఎన్నోసార్లు అనుకున్నాడు శేఖరం.

సులోచన ఆచూకీ ఎక్కడా తెలియలేదు. విశ్వ ప్రయత్నం చేశాడు. లాభం లేకపోయింది.

ఆమె విదేశాలకు వెళ్ళిపోయిందో? ఆత్మహత్య చేసుకొందో? ఏది జరిగినా ఆశ్చర్య పడవలసింది లేదు. ఆమెలోని ఆత్మాభిమానం అంతటిది!

మఖలో పుట్టి పుబ్బలో మారిపోయే మన స్తత్వం గల మనిషి ఒక మగాడేనా అని సులోచన అనుకోక మానదు. అంతకంటె అతనికి తలకొట్టేసే మాట మరొకటి లేదు.

అవును —

తను వోడిపోయాడు.

ఆమె గెలిచింది.

కారు చీకటి కేం తెలుసు సూర్య తేజస్సుని శ్లాఘించడం?

కాలం మారుతుంది—అది దాని నైజం. మారే వరం ఉంది కనుకనే జనం దానికి భయపడేది. మనిషిని ఆపి, నిలదీసి, శాసించ గల శక్తి దాని కున్నది. కాలచక్రం ఇరుసుకు వ్రేలాడే మనిషి కంకర రాళ్ళను తన్నుకుంటూ, ఎగుడు దిగుడుల వూపులో తల తిరుగుతున్న బాధలో మొగ్గలు వెయ్యక తప్పదు. అదే జీవితం.

మరో ఐదేళ్ళు గడిచిపోయాయ్.

ఇరవై సంవత్సరాల కాలం గతంలోకి పోయింది.

శేఖరంలో ఇప్పుడు వృద్ధాప్యపు ఛాయలు స్పష్టంగా కనబడుతున్నాయ్. చిక్కి శల్యమై పోయాడు. సగం తల నెరిసింది. సహనం ఇగిరి పోయింది.

రెండు దశాబ్దాలు కర్కశ, కఠోర కాల ప్రవాహంలో కన్నీళ్ళ స్నానం చేశాడు. ఈ సుదీర్ఘ కాలంలో ఏ ఒక్క ఆనందానుభూతీ స్పర్శా మాత్రంగానైనా అతన్ని తాక లేదు. అది కాలం సాధి కారంగా అతనికి కలగజేసిన మనస్తాపం. అసలు జీవితమే ఒక శాపం.

## 6

ఆ వేళ తెల్లవారింది.

స్నానంచేసి పట్టు బట్టలు కట్టుకున్నాడు శేఖరం. దేవుడి ముందు కూర్చుని చాలాసేపు ఏదో మననం చేసుకున్నాడు.

జన్మజన్మలకీ చెప్పుకోవలసిన శుభదినం ఆవేళ. సులోచన తిరిగి వస్తున్నది ఆవేళే.

ఇన్నాళ్ళూ ఆమె ఢిల్లీలో స్నేహితురాలింట్లో ఉందిట. అదృష్టం పండి అడ్రసు దొరికింది. వెంటనే ఆమెకు ఉత్తరం వ్రాశాడు. నిజానికి అది ఉత్తర్కం కాదు. సెంటుజల్లి, కొనలకు పసుపురాసి పంపిన ఆహ్వాన శుభ పత్రిక.

అక్కడినుంచి కూడా ఉత్తరం వచ్చింది.

"మీరు తొందరపడి నన్ను అనుమానించారు. నేను తొందరపడి వెళ్ళిపోయాను. తప్పు ఇద్దరి లోనూ ఉంది. మనకు ఇరవై సంవత్సరాల కఠిన శిక్ష చాలు. మీ ఉత్తరం అందింది. ఇహ నేనిక్కడ ఉండలేను. వచ్చేస్తున్నాను" అని వ్రాసింది సులోచన.

పట్టుబట్టలతోనే వీధి గుమ్మం మీద కాచుకుని కూర్చున్నాడు శేఖరం. దాసు ఆనందం, కంగారు ఇహ చెప్పనే అక్కర్లేదు. ఏ హడావుడీ లేకుండా కూర్చు న్నది టామీయే. పాపం — అది సులోచనను ఎరుగదు.

కారులోంచి సులోచన దిగింది ఇంటిముందు. గేటు లోపలికి వచ్చింది. అది ఆమెకు కోట్లు పూజ చేసే చోటు. తనచోటు. బంగారు వాకిట తిరిగి పాదం పెడుతున్న ఆనంద తేజో కిరణాలు ఆమె కళ్ళల్లో. తనకు జీవితాన్ని ఇచ్చినవాడు, తనవాడు శేఖరాన్ని ఇన్నాళ్ళకు చూసిన అనిర్వచనీయ మధుర భావనాస్ఫూర్తి.

ఆనందాతిరేకంలో, పరవశానుభూతిలో, కళ్ళ నీళ్ళ మధ్య ఆమెను సరిగా చూడనేలేకపోయాడు శేఖరం.

ఆమె లోపలికి వచ్చింది.

"సులోచనా ..." మనసారా పిలిచాడు గదిలోంచి.

ఆమె వచ్చింది.

ఆమె కూడా ఇప్పుడు మునుపటిలా లేదు. ఆ పాదాల్లో మునుపటి అందం, పటుత్వం లేవు. కళ్ళల్లో చిలిపితనం లేదు. శరీరంలో సత్తువ లేదు. మొహంలో సగం జీవితాన్ని వృథా చేసుకున్న నిస్పృహ చారలు.

ఆమెను గాఢాలింగనం చేసుకున్నా డతను. తలపై మూడుసార్లు ముద్దు పెట్టుకున్నాడు. తలనించి పాదాల దాకా వెర్రిగా నిమిరాడు. "ప్చ్ ... చిక్కిపోయావే" అన్నాడు.

ఆవేళ పండుగ చేసుకున్నారు. భోగి, సంక్రాంతి, ఉగాది, దీపావళి—అన్ని పండుగలు కలిసి వచ్చిన రోజది.

ఆ సాయంత్రం ఆమెతో అన్నాడు శేఖరం—

"మనకు వయసు మళ్ళిన మాట నిజమే కాని, మనం వృద్ధులం కాము" అని.

కథను కంచికి వెళ్ళనివ్వడని ఆమెకు అర్థ మయింది. ✱